

మహానందీశుడికి నృత్య నీరాజనం

మహానందీశ్వరుడిలో మంగళవారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. – మహానంది



మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీశైల క్షేత్రంలోని మాడవీధుల్లో గజవాహనంపై ఊరేగుతున్న భ్రమరాంబా మల్లికార్జున స్వామివారు



● తూడిచెర్లలో శివరాత్రి ఉత్సవాలు

తూడిచెర్ల గ్రామంలోని శంకరమల్లేశ్వర, భ్రమరాంబికామాత ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. – జూపాడుబంగ్లా

శంభో శివ శంభో

శ్రీశైలంటెంపుల్: భక్తుల శివనామస్మరణతో శ్రీగిరి మారుమోగుతుంది. ఏటు చూసినా శివనామస్మరణలు, భజనలు, శివస్తుతి చేస్తుండడంతో శ్రీశైలక్షేత్రం మరింత ఆధ్యాత్మికతను సంతరించుకుంది. మహాశివరాత్రి పర్వదినం సమీపిస్తుండడంతో పాదయాత్రగా తరలివచ్చే భక్తులు సైతం తండోపతండాలుగా తరలివస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చంటిపిల్లల తల్లులు సైతం పాదయాత్రగా తరలివస్తున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలచరించిన భక్తులు, కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటున్నారు. అనంతరం భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్ల వద్దకు చేరుకుంటున్నారు. క్షేత్ర పరిధిలో అన్నదాన శిబిరాలు, విడిది కేంద్రాలు, మెడికల్ క్యాంపుల్లో భక్తులకు సేవలు అందిస్తున్నారు.




పాదయాత్ర భక్తులకు అన్నప్రసాద వితరణ, నల్లమల అడవిలో పాదయాత్రగా తరలివస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో నందీశ్వరుడి కొమ్ముల నుంచి శివుడి దర్శనం

ఉత్సవాలకు శివపార్వతుల పయనం



విష్ణు నంది క్షేత్రానికి ఊరేగింపుగా బయలుదేరిన ఆది దంపతులు



కోలాటం నిర్వహిస్తున్న కళాకారులు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని విష్ణునంది ఆలయ ఉత్సవ మూర్తులు శివపార్వతులు మహాశివరాత్రి ఉత్సవాలకు పయణమయ్యారు. బి.కోడూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉన్న శివపార్వతుల విగ్రహాలను ఆలయ చైర్మన్ పల్లె తిరుపెం రెడ్డి, వెంగళరెడ్డి పేట సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిచి ఊరేగింపుగా బయలుదేరి విష్ణునంది ఆలయానికి చేర్చారు. బుధవారం అక్కడ స్వామి అమ్మవార్లు భక్తుల నుంచి పూజలందుకోనున్నారు. కోలాటంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల ఆకట్టుకున్నాయి.

ఉత్సవాలను విజయవంతం చేద్దాం

● ఏఎస్పీ జావళి



ఏర్పాట్లపై ఈఓ, ఏఈఓతో మాట్లాడుతున్న ఏఎస్పీ జావళి

మహానంది: మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ అన్నారు. మంగళవారం మహానందిలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, సిబ్బందితో ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించి పలు సూచనలు చేశారు. సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో సమావేశమై సూచనలిచ్చారు. రద్దీ ప్రాంతాల్లో విధులు నిర్వహించేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లు చూస్తూ నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షేత్రం..పరిశుభ్రం

● వెయ్యి మంది కార్మికులతో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు

శ్రీశైలంటెంపుల్: మల్లన్న క్షేత్ర పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో రోజుకు 1000 మంది పారిశుధ్య కార్మికులతో పనులు చేయించారు. క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా విభజించి, 67 లొకేషన్లను గుర్తించారు. బ్రహ్మోత్సవాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక ప్రణాళికలు రచించి, ఇందుకోసం టెండర్లను సైతం నిర్వహించారు. శ్రీశైల దేవస్థాన పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందితో జిల్లా పంచాయతీ అధికారులు సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టారు. 10 ట్రాక్టర్లతో చెత్తాచెదారాలను డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన రోజు నుంచి 11 రోజుల పాటు పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నారు. ఎక్కడ కూడా చెత్తా చెదారం కనిపించకుండా, శివస్వాములు మాలధారణ వస్త్రాలు, స్నానాలచరించే ప్రదేశాల వద్ద, మరుగుదొడ్ల వద్ద, కైలాస ద్వారం, శిఖరేశ్వరం, హఠకేశ్వరం, పాలధార పంచధార, సాక్షి గణపతి, పాతాళగంగ తదితర ముఖ్య ప్రదేశాల్లో సైతం పారిశుధ్య పనులు చేపడుతూ క్షేత్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

మహిళల జీవనోపాధికి రుణాలు

మహానంది: మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు స్వయం సహాయక సంఘాల్లో రుణాలు ఇస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జవహర్ బాబు తెలిపారు. బుక్కాపురంలోని పొదుపు సమాఖ్య భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. జీఎం జవహర్‌బాబు మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ద్వారా మహిళలకు చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందిస్తున్నామన్నారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు, మార్కెటింగ్ చేసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐపీఓ చంద్రశేఖర్, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.